
విజయ సిద్ధిదాయిని

–న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల సందడి అంబరాన్నంటుతోంది. ఉత్సవాల తొమ్మిదో రోజు శుక్రవారం భ్రమరాంబాదేవి భక్తులకు సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లను అశ్వవాహనంపై అధిష్ఠింపజేసి, పుష్పార్చనలు చేసి మంగళహారతులు సమర్పించారు. ఉత్సవం వద్ద కళాకారులు పలు రకాల సంప్రదాయ నృత్యాలు చేసి సందడి చేశారు.

మంత్రి ప్రత్యేక పూజలు

దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దంపతులు మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో వారికి అర్చకులు వేదాశీర్వచనాలు పలుకగా, స్వామివార్ల జ్ఞాపికలను కమిషనర్ అందజేశారు. అనంతరం 2025 సంవత్సరం దేవస్థానం క్యాలెండర్లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు.



అశ్వవాహనసేవ

అశ్వవాహనంపై కొలువైన స్వామిఅమ్మవార్లు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులు

నేటితో ముగియనున్న ఉత్సవాలు

శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో మండపారాధనలు, కలశార్చనలు, విశేష కుంకుమార్చనలు, యాగాంగ హవనములు, చండీహోమం, రుద్ర హోమం, జయాదిహోమాలు జరుగనున్నాయి. 9.45 గంటలకు రుద్రయాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, వసంతోత్సవం, అవబృథం, త్రిశూల తీర్థోత్సవం క్రతులు స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు భ్రమరాంబాదేవి నిజరూప అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లకు నందివాహన సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు ఆలయ ఉత్సవం, శమీపూజ, 8 గంటలకు స్వామిఅమ్మవార్లకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం జరుగనుంది. తెప్పోత్సవంతో దసరా మహోత్సవాలు ముగియనున్నాయి.

దసరా సందడి



ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సెక్కేందుకు ఇబ్బందులు



బస్సు సీటు కోసం పాట్లు

● దసరాను ఆనందంగా జరుపుకొనేందుకు జనాలు మార్కెట్ల వైపు అడుగలేయడంతో అన్ని ప్రాంతాలు రద్దీగా మారాయి. మామిడిఆకులు, పూజా సామగ్రి, పండ్లు విక్రయించే దుకాణాలు కిటకిటలాడాయి. ఆత్మకూరులో కిలో మల్లెపూలు రూ.వెయ్యి, కిలో బంతి రూ.వంద, కిలో చామంతి రూ.400, కిలో గులాబీ రూ.600 చొప్పున విక్రయించారు.

● విజయదశమికి సొంతూరుకు వెళ్లేందుకు జనాలు ఆర్టీసీ బస్టాండ్ల వైపు అడుగులు వేయడంతో ఇవన్నీ రద్దీగా మారాయి. సొంతూళ్లకు వెళ్లేందుకు గంటలసేపు బస్సుల కోసం పడిగాపులు కాశారు. వచ్చిన కాస్త బస్సుల్లో సీట్లు కోసం పాట్లు పడ్డారు. ఫీట్లు చేశారు.

–న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



కొనుగోలుదారులతో రద్దీగా మార్కెట్ యార్డు

పండగ ప్రత్యేకతలు



విజయదశమి శుభాకాంక్షల ప్రత్యేక అనుబంధం నేటి సంచికతో ఉచితంగా అందుకోగలరు.

దేవరగట్టు.. భక్తులదే పట్టు

దసరా అనగానే గుర్తొచ్చేది దేవరగట్టు 'కర్రతాళ' ధ్వనులు.. మాళ మల్లేశ్వరస్వామి దసరా 'బన్ని జైత్రయాత్ర' శనివారం అర్ధరాత్రి ప్రారంభమవుతుంది.. 800 అడుగుల ఎత్తైన కొండపై వెలసిన స్వామి ఉత్సవమూర్తులను దక్కించుకునేందుకు కర్రలతో తలపడతారు.. 13న ఉదయం దైవ కార్ణీకం (భవిష్యవాణి) అనంతరం మరోమారు ఆయా గ్రామాల భక్తులు ఉత్సవమూర్తుల కోసం కర్రలతో తలపడతారు. 14న స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. 15న గొరవయ్యల ఆట, గొలుసు తెంపుట, వసంతోత్సవం, సాయంత్రం కంకణ విసర్జన చేస్తారు. 16న ఉత్సవమూర్తులు నెరణికి గ్రామం చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.



–హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే:

యువ సాహస పండగ

ఆయుధ పూజ.. దుర్గమ్మకు మొక్కులు.. కమ్మనైన వంటలు.. చిన్నారుల ఆటలు.. బంధువుల రాక.. విజయం కలగాలని శమీ పూజలు దసరాకు మనకు కనిపించే సందడి.. ఎమ్మిగనూరు మండలం గుడేకల్లులో 'యువ' విన్యాసాలు అలరిస్తాయి.

–ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే:



అశ్వాల పార్వేట.. సంప్రదాయ వేడుక

దసరా వేడుకల్లో మద్దికెర అశ్వాల పార్వేట రాష్ట్రంలో ప్రత్యేకతను సంతరించుకుంది. మద్దికెరను పాలించిన పాలెగాళ్లు యాదవ రాజుల వంశీకుల కుటుంబాల వారు గ్రామంలో వందల ఏళ్లుగా పార్వేట సంప్రదాయం కొనసాగిస్తున్నారు. ఈ వేడుక తిలకించేందుకు స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివస్తారు.



మద్దికెర, న్యూస్‌టుడే:

ఆరోగ్య విజయదశలు

న్యూస్‌టుడే, నంద్యాల



చెడుపై విజయం సాధించడమే 'దశ'హరా పండగ.. వ్యవహారంలో దసరాగా స్థిరపడింది.. రామాయణ, మహాభారత ఇతిహాసాల్లోనూ పండగకు సంబంధం కనిపిస్తుంది. రామచంద్రమూర్తి రాక్షస సంహారం చేసి రావణుడిపై విజయం సాధించిన దినంగా రామాయణంలో ప్రస్తావించారు. పాండవులు ధర్మానికి కట్టుబడి అరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తి చేసుకుని కౌరవ సంహారానికి ఉద్యుక్తులవుతూ విజయ సాధన కోసం జమ్మి చెట్టు మీద దాచిన తమ ఆయుధాల్ని కిందికి దించిన దినంగా విజయదశమిని భావిస్తారని మహాభారతంలో ప్రస్తావించారు.

శరదృతువులో తేలికైనట్లు... సమస్యా మేఘావృతమైన మనసు విఘ్నేశ్వరుని ఆరాధనతో ఆపదల్ని తొలగించుకుని శరత్కాల మేఘంలాగా స్వచ్ఛమైన, తేలికైన మనసుతో అందరమ్మ ఆరాధనకు సన్నద్ధమవుతున్నవేళ ఇది. ఈ శుభ తరుణంలో అమ్మవారి వైభవాన్ని కీర్తించుకోవడానికి నవరాత్రులు నిర్వహిస్తాం.. నవరాత్రులు అంటే తొమ్మిది రాత్రులే కాదూ.. తొమ్మిది పగళ్లు. అని కూడా అర్థం. తొమ్మిది రాత్రుల తర్వాత వచ్చే పగలే విజయదశమి.

అమ్మవారు మహిషాసురుడిని సంహరించిన రోజు.. దశ దుర్గుణాలు సంహరించినందుకు ఈ పేరు వచ్చింది. బద్ధకం.. అతిగా తినడం.. కాలు కదపక పోవడం.. 'మత్తు'కు బానిస కావడం.. సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడపటం.. వంటి దుర్గుణాలను అంతమొందించుకోవడానికి ఓ లక్ష్యం పెట్టుకుందాం... దసరా నుంచే తొలి అడుగు వేద్దాం.!!

నిత్యం ఎంత శక్తి అవసరం రోజువారీ అవసరాలకు ఆరోగ్యకరమైన వ్యక్తికి 2,600-2,800 కిలో క్యాలరీల వరకు, మహిళలకైతే 2,200-2,400 వరకు సరిపోతాయి.

1 షాపింగ్ మాల్స్‌కు వెళ్లినప్పుడు ఐదు నిమిషాలపాటు మెట్లపై నడిస్తే 51 క్యాలరీలు వరకు ఖర్చవుతాయి.

2 కూర్చొని ఫోన్ మాట్లాడే బదులు గది, బాల్కనీ మేడపై నడుస్తూ మాట్లాడటం మంచిది.

3 టీవీ చూసే సమయంలో రిమోట్‌ను దూరంగా పెట్టండి. ఛానల్ మార్చాలనుకున్నప్పుడల్లా వెళ్లి తెచ్చుకోండి.

4 షవర్ స్నానం కాకుండా బకెట్‌లోని నీటిని మగ్‌తో తీసుకుని స్నానం చేయడం వల్ల మరికొన్ని క్యాలరీలు ఖర్చవుతాయి.

5 ఒక ట్రెండు అంతస్తుల వరకు ఎక్కాలంటే లిఫ్ట్‌లో వెళ్లకుండా మెట్ల మార్గాన్నే ఉపయోగించండి. ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది.

6 నిత్యం 30 నిమిషాలు సైకిల్ తొక్కడం వల్ల దాదాపు 75 నుంచి 670 అదనపు క్యాలరీలు ఖర్చువుతాయట.

7 స్నానం చేసేటప్పుడు పాటలు పాడితే అదనంగా 42 క్యాలరీలు ఇట్టే కరిగిపోతాయి.

8 ఛలోక్తి విసిరినప్పుడు హాయిగా నవ్వుకోండి. టీవీలో హాస్య సన్నివేశాలు చూసి గట్టిగా నవ్వండి.

9 కంప్యూటర్ ముందు విధులు నిర్వహించే వారు మధ్యమధ్యలో లేచి నిల్చుండటం... నడవటం వంటివి చేయాలి

10 ఉదయం పళ్లు తోముకునే సమయంలో ఒంటి కాలిపై నిల్చోవాలి.

ఎండు ఫలం ఎంతో మధురం

ఎండు ఫలాలు తినేవారి సంఖ్య పెరగడంతో కర్నూలు, నంద్యాల పట్టణాల్లో పెద్ద దుకాణాలు వెలుస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రకరకాల ఎండు ఫలాలు తెప్పిస్తున్నారు. జీడిపప్పును గోవా నుంచి, ఆల్‌మండ్స్ (బాదం), పిస్తా కాలిఫోర్నియా, ఎండు ద్రాక్ష, అంజీరాను ఆఫ్ఘనిస్తాన్, ఖర్జూరాలో అజ్వా రకం, మెడ్జల్ రకాలను సౌదీ అరేబియాలోని మదీనా నుంచి తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. ఆల్‌మండ్స్ మమ్రా ఇరాన్ నుంచి, ఆప్రికాట్ బోల్ట్ (ఖుబానీ) టర్కీ, వాల్‌నట్స్, వాల్‌నట్ షెల్స్ కశ్మీర్ నుంచి, పొమేలా (ఎండిన నారింజ పండు) ఏషియన్ ఫ్రూట్స్‌ను మలేషియా, ఇండోనేషియా, శ్రీలంక దేశాల నుంచి, బ్లూ బెర్రీస్ యూరప్ నుంచి, గోల్డెన్ కివీ డ్రైడ్, గువా డ్రైడ్ (ఎండిన జామ) మన దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి, కుంకుమ పువ్వు, జాపత్రి కశ్మీర్ నుంచి దిగుమతి చేసుకొంటున్నారు.

ఆరోగ్య సిరి సంపదలు




✦ నిత్యం మనిషికి అవసరమైన పీచు పదార్థం (ప్రతి ఒక్కరికీ రోజుకు 38 గ్రాములు అవసరం) సిరి ధాన్యాల నుంచే లభిస్తుంది. మిగిలిన 10 గ్రాములు కూరగాయలు, ఆకుకూరల నుంచే లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

✦ డబ్ల్యూహెచ్‌వో, ఐసీఎంఆర్ లెక్కల ప్రకారం ఒక వ్యక్తికి పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు రోజుకు 400 గ్రాములు, బియ్యం 190 గ్రాములు, పప్పు ధాన్యాలు 40 గ్రాములు అవసరమవుతాయి.

✦ ఐదుగురు వ్యక్తులున్న కుటుంబానికి 200 గ్రాముల పప్పుధాన్యాలు, రెండు పూటలకు కిలో బియ్యం, అర కిలో పండ్లు, కిలోన్నర కూరగాయలు, ఆకుకూరలు కావాలి.

తెగ తినేస్తున్నారు

జంక్‌ఫుడ్ లేనిదే రోజు గడవడం లేదు. ఉమ్మడి జిల్లాలో చాలా మంది 3 వేల నుంచి 4 వేల క్యాలరీలు ఒంట్లోకి పంపిస్తున్నారు. పండగ వేళ పిండివంటలు, మిఠాయిలతో మరిన్ని క్యాలరీలు ఒంట్లోకి వెళ్లనున్నాయి.



ఎంత తింటున్నామో

(జాతీయ పోషకాహార సంస్థ ప్రకారం)

పదార్థం	పరిమాణం	కిలో క్యాలరీలు
సమోసా	1	200
బర్ఫీ	2 ముక్కలు	400
హల్వాకేసరి	అరకప్పు	320
ఐస్‌క్రీం	అరకప్పు	200
బర్గర్	1	260
పిజ్జా	1 ముక్క	250

క్యాలరీలు ఖర్చు చేయాలండీ

అదనపు క్యాలరీలను ఎప్పటికప్పుడు సరిచేయకపోతే శరీరంలో వేర్వేరు భాగాల్లో కొవ్వు పేరుకుపోతుంది. దీంతో బొజ్జ పెరగడం, ఊబకాయం వంటి సమస్యలు చుట్టుముడతాయి. చాలా మంది బద్ధకంతో వ్యాయామాన్ని వాయిదా వేస్తుంటారు. ఫలితంగా టైప్-2 మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధుల బారినపడే ప్రమాదాలు కొన్ని తెచ్చుకుంటున్నారని కర్నూలు సర్వజన ఆసుపత్రి న్యూట్రీషియన్ రవీంద్ర తెలిపారు. క్యాలరీలను తగ్గించుకొనే కొన్ని చిట్కాలను అందించారు.

13 నుంచి జిల్లాలో భారీ వర్షాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 13 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను శుక్రవారం ఆమె ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని మట్టిమిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

శ్రీశైలం జలాశయం నీటిమట్టం 880.90 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి 880.90 అడుగులు, నీటి నిల్వ 192.9694 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ పరీవాహక ప్రాంతాలైనా జూరాల, సుంకేసుల నుంచి 45,844 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 44,955 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

భూ బదలాయింపునకు చర్యలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలంలో స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చిన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శనం అనంతరం మాట్లాడుతూ.. శ్రీశైల దేవస్థానానికి చెందిన సుమారు 4,500 ఎకరాల భూమిలో ఎక్కువ భాగం అటవీశాఖ ఆధీనంలో ఉందన్నారు. ఆ భూమిని దేవస్థానం వినియోగించుకునే విధంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి చెప్పారు. దేవస్థానం ఆధీనంలోకి భూమి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద రూ.100 కోట్లు, పర్యాటకశాఖ ద్వారా రూ.1,000 కోట్లను మంజూరు చేసే విధంగా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. సీఎం సంకల్పం మేరకు శ్రీశైలాన్ని దివ్య క్షేత్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

విజయపథంలో నడుద్దాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విజయదశమిని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ.ఫరూక్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ జి.రాజకుమారి గనియా, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు.

105 దుకాణాలకు 2155 టెండర్లు

రూ.43.1 కోట్ల ఆదాయం రాక ● నంద్యాలలో ముగిసిన ప్రక్రియ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ శుక్రవారం రాత్రి ఏడు గంటలకు ముగిసింది. నంద్యాల జిల్లాలో 105 మద్యం దుకాణాలకు 2155 టెండర్లు దాఖలు కాగా, ప్రభుత్వానికి రూ. 43.1 కోట్ల ఆదాయం సమకూరిందని ఆ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. స్టేషన్ల వారీగా వివరాలను తెలియజేశారు.

స్టేషన్లు	మద్యం దుకాణాలు	దాఖలైన టెండర్లు
ఆళ్లగడ్డ	19	325
ఆత్మకూరు	13	248
బనగానపల్లె	12	168
డోన్	16	370
కోవెలకుంట్ల	11	150
నందికొట్కూరు	10	181
నంద్యాల	24	713

ఎన్నో వస్తాయనుకుంటే...


నంద్యాల జిల్లాలో 2500 నుంచి 3 వేల వరకు టెండర్లు దాఖలవుతాయని ఆబ్కారీ శాఖ అధికారులు భావించగా 2155 మాత్రమే దాఖలయ్యాయి. నంద్యాల ఆబ్కారీ స్టేషన్ పరిధిలోని 24 మద్యం దుకాణాలకు 713 టెండర్లు ఎక్కువగా వచ్చాయి. కోవెలకుంట్ల, బనగానపల్లె, నందికొట్కూరు స్టేషన్ల పరిధిలో రెండు వందలు కూడా టెండర్లు దాటలేదు. రెండు రోజులు గడువు పెంచినా అనుకున్న మేర దాఖలు కాలేదు. ఆశావాహుల కోసం స్టేషన్ల వద్ద బ్యాంకు, డిజిటల్ సిబ్బందితో పాటు అన్ని ఏర్పాట్లు చేసినా గుత్తేదారులు ఎక్కువ మంది ముందుకు రాలేదు.

ఈనెల 14న లాటరీ...

జిల్లాలో 105 మద్యం దుకాణాలకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఈనెల 14న కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా నిర్వహించనున్నారు. టెండరు వేసిన వ్యక్తికి ఆబ్కారీ స్టేషన్‌లో ఇచ్చిన పాస్ తెస్తే లోపలకు అనుమతి ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. లాటరీ తగిలిన వ్యక్తి ఆరో వంతు డబ్బుల్ని చెల్లించి ఈ నెల 16న నూతన పాలసీ ప్రకారం మద్యం దుకాణాలను ప్రారంభించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

అమ్మవారికి పూజలు

శ్రీశైలం, న్యూస్‌టుడే: శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా నవరాత్రులను పురస్కరించుకుని శృంగేరి మఠం, కంచిమఠం, శ్రీదేవి వేద విద్యాలయం, దత్తగిరి ఆశ్రమం, వాసవి సత్రంలోని కన్యక పరమేశ్వరికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం దానయ్యస్వామి వీరశైవ గురుకులంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహిషాసురమర్దిని అలంకారంలో కన్యకపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు.



పూజలు చేస్తున్న వేద విద్యార్థులు

ఆనందంగా విజయదశమి జరుపుకోవాలి: ఎస్పీ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ప్రజలకు ఆ దుర్గామాత అన్ని రంగాల్లో విజయాన్ని చేకూర్చాలని, ఆనందంగా అంతా విజయదశమిని జరుపుకోవాలని ఎస్పీ అదిరాసింగ్ రాణా కోరారు. విజయదశమిని పురస్కరించుకుని శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలోని ఆయుధాగారంలో పోలీసులు ఉపయోగించే అన్ని ఆయుధాలకు, మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగంలోని వాహనాలకు పూజలు జరిపారు. ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీ యుగంధర్ బాబు, సీఐలు ఇస్మాయిల్, అస్రర్ బాషా, మల్లికార్జునగుప్తా, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధాల పూజలో పాల్గొన్న ఎస్పీ, అదనపు ఎస్పీ, సీఐలు, సిబ్బంది

శ్రీశైలంలో ఆయుధ పూజలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం దేవస్థానం పిల్లర్‌బెడ్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో డి.పెద్దిరాజు దుర్గామాత చిత్ర పటానికి పూజలు చేశారు.



పిల్లర్‌బెడ్‌లో ఆయుధ పూజ నిర్వహిస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

నిత్యావసర వస్తువులకు ప్రత్యేక కౌంటర్లు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర వస్తువుల సరసమైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని జేసీ సి.విష్ణుచరణ్ తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్ రైతుబజారులో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఆయన ప్రారంభించి వినియోగదారులకు సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ విపణిలో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ నూనెలు అధిక ధరలు ఉన్న నేపథ్యంలో మిల్లుల యజమానులతో మాట్లాడి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నంద్యాలలో శ్రీనివాసనగర్, టెక్కె మార్కెట్‌యార్డులలోని ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న జేసీ

అకౌంట్స్ అధికారి నియామకం

కర్నూలు (వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖ పరిధిలో కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా ఆపరేషన్ సర్కిల్ కార్యాలయానికి అకౌంట్స్ అధికారిని నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు సర్కిల్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించే ఆర్. హెచ్. అంకమహేశ్వరరావును నంద్యాల జిల్లా విద్యుత్తు శాఖ ఏవోగా బదిలీ చేశారు. కర్నూలు జిల్లా ఆదోని డివిజన్‌లో జేఏవోగా పని చేస్తున్న ఎం.విజయకుమారికి ఏఏవోగా పదోన్నతి కల్పించారు.

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

స.హ. చట్టాన్ని బతికించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టాన్ని బతికించాలని స.హ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అకుమళ్ల రహీమ్ పేర్కొన్నారు. ఈ చట్టం దరఖాస్తుదారులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. సమాచార హక్కు చట్టం 2005 పార్లమెంట్ ఆమోదం పొంది 19 ఏళ్లయిన సందర్భంగా శుక్రవారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స.హ. చట్టం సమాచార బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చట్టం కింద వచ్చే దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి శివశంకర్, సంపంగి రామరాజు, శ్రీనివాసులు, నాగకాంత్‌రెడ్డి, ఆరీప్, నబీరసూల్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



స.హ చట్టం గోడపత్రాలను అందజేస్తున్న రహీం

ప్రమాదాలను నివారించండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు నుంచి పగిడ్యాల వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న భారీ గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా నివారించాలని సీపీఎం నాయకుడు పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. ఆటో కార్మికులతో కలిసి రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రహదారికి ఇరువైపులా గోతులు పడ్డా మరమ్మతులు చేపట్టలేదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం: **సమస్య:** పట్టణంలోని లలిత నగర్‌లో పందుల బెడద అధికంగా ఉంది.
–లక్ష్మీనారాయణ.

సమస్య: పట్టణంలోని ఎమ్మెస్‌నగర్‌లో కాలనీలో కోతుల బెడద అధికమైంది. – సాయి.

సమస్య: పట్టణంలోని మూలసాగరం కాలనీలో కోతులు, కుక్కల బెడద అధికమైంది. – వాసు.

సమాధానం: త్వరలోనే పందులను, కోతులను, కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం.
–లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

కబ్జా కోరలు.. పట్టణవాసులకు ఇక్కట్లు

నంద్యాల పురపాలకం, రైతునగరం, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షం కురిసినా నంద్యాల పట్టణంలోని వీధులన్నీ జలమయమవుతున్నాయి. మోకాళ్ల వరకు నీరు చేరి కుంటల్ని తలపిస్తున్నాయి. ఏటా వానాకాలంలో పట్టణ వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు లేకపోవడం..మురుగు కాలువలు, రోడ్ల విస్తరణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం, ఉన్న వాటిని ఆక్రమించడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు చెబుతున్నారు.



పద్మావతినగర్‌లో ఆక్రమణకు గురైన కాల్వ

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

నంద్యాల పట్టణంలో సుమారు 3 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. దాదాపు 63 వేల గృహాలు ఉన్నాయి. వాటిలో చాలా నిర్మాణాలకు సరైన ప్రణాళిక లేదు. మూడు, నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు పురపాలక నుంచి ఎలాంటి అనుమతులు తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే పట్టణానికి శాపంగా మారింది. గతంలో కొద్దిపాటి స్థలాల్లోనే గృహాలు నిర్మించుకున్నారు. రహదారి కోసం కనీసం ఎంత స్థలం వదలాలో తెలియకుండానే నిర్మాణాలు చేపట్టారు. దీంతో పట్టణంలో దాదాపు సగం వీధుల్లో కేవలం 10 నుంచి 15 అడుగుల రోడ్లే అధికంగా ఉన్నాయి. ఈ ఇరుకు దారుల్లోనే మురుగు కాలువలను నిర్మించారు. ఇక వర్షాలు కురిస్తే అంతే సంగతులు. మురుగు పొంగి రహదారుల పైనా, ఇళ్ల ఎదుట నిలిచిపోతోంది.

మురుగు కాల్వలు ఆక్రమణ

నంద్యాల పురపాలక పరిధిలో పక్కా కాల్వలు 310 కి.మీ., మేజర్ కాలువలు 37 కి.మీ., మీడియం 26 కి.మీ. మైనర్ 246, కచ్చా కాల్వలు 30 కి.మీ., స్టోమ్ వాటర్ డ్రైయిన్స్ 43 ఉన్నాయి. పురపాలక పరిధిలో రోడ్లు దాదాపు 290 కి.మీ. ఉన్నాయి. వాటిలో అత్యధికంగా పట్టణంలోనే ఉన్నాయి. ఎవరికి వారు కాలువలను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దుకాణాలు భవనాలు నిర్మించడంతో అవి పూడికతో నిండిపోతున్నాయి. ప్రధానంగా బైర్మల్ వీధి, డేనియల్‌పురం, పద్మావతినగర్, విశ్వనగర్, శ్రీనివాసనగర్, హరిజనవాడ, దేవనగర్, శ్యాంనగర్, ఎన్జీవోస్ కాలనీ, ఎస్బీఐ కాలనీ, సలీంనగర్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరంతా రోడ్డు మీదకు చేరి రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి మురుగు పారేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తున్నాం

-నిరంజన్ రెడ్డి, పురపాలక కమిషనర్, నంద్యాల

పట్టణంలో పలుచోట్ల ఆక్రమణలు తొలగించాం. కాలువలపైనా ఎవరూ నిర్మాణాలు చేపట్టకూడదు. దుకాణదారులు కాలువలపైన సామగ్రిని ఉంచొద్దు. ఎవరైనా రోడ్లను, కాల్వలను ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. నిరంతరం ఆక్రమణల్ని తొలగిస్తున్నాం.

గోతులదారిలో నడిచేదెట్లా..?



చిన్నపాటి వర్షం కురిసిందంటే బండిఆత్మకూరు మండలంలో రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. ఈర్నపాడులోని ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరంతా రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. ఈదారి గుండా మణికంఠాపురం, శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల ప్రజలు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. గోతుల్ని పూడ్చాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బండిఆత్మకూరు,**

42 శాతం నిధులు సీమకు కేటాయించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: సాగునీటి బడ్జెట్‌లో 42 శాతం నిధులు రాయలసీమకు కేటాయించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన లేఖ రాశారు. సీమలో ఉన్న వ్యవసాయయోగ్యమైన భూమిలో కేవలం 21 శాతం భూమికి సాగునీరు అందించేలా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు.

జీవాల దొంగ అరెస్టు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలో రెండు రోజుల కిందట జరిగిన చోరీలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితున్ని స్థానిక మార్కెట్ యార్డు వద్ద శుక్రవారం అదుపులోకి తీసుకుని నాలుగు జీవాలు, పవర్ స్ప్రేయర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు స్థానిక జీవనజ్యోతి వద్ద షెడ్డు వేసుకుని గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల కిందట ఓర్వకల్లు మండలం ఉసేనాపురం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ రెండు మేకలు, రెండు గొర్రెలతో పాటుగా స్ప్రేయర్‌ను అపహరించి ఆటోలో తీసుకువెళ్లారన్నారు. వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

విద్యుత్తు ప్రమాదంలో కాపలాదారు దుర్మరణం

మిడుతూరు, న్యూస్‌టుడే: చింతలపల్లిలో జరిగిన విద్యుత్తు ప్రమాదంలో రాత్రి కాపలాదారు అబ్దుల్లా (31) మృతి చెందినట్లు ఎస్సై సుబ్బయ్య తెలిపారు. గతనెల 21న చింతలపల్లిలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విధులు నిర్వహిస్తున్న అబ్దుల్లా విద్యుదాఘాతంతో గాయపడ్డారు. బాధితుడిని చికిత్స నిమిత్తం మిడుతూరు వైద్యశాలకు, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా శుక్రవారం మృతి చెందాడని, తల్లి రజియాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్సై తెలిపారు.



అబ్దుల్లా

పదహారు రోజుల వ్యవధిలో దంపతులు మృతి

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని ఒండుట్లలో పదహారు రోజుల వ్యవధిలో దంపతులు మృత్యువాతపడ్డారు. గ్రామానికి చెందిన కర్రెల్ల మద్దిలేటి (70), మద్దమ్మ (65) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే వారు. వారికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మద్దమ్మ అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 16 రోజుల కిందట మృతి చెందారు. భార్య మరణంతో దిగులు చెందిన మద్దిలేటి శుక్రవారం తెల్లవారుజామున ఇంటిముందే తనువు చాలించారు. 16 రోజుల వ్యవధి లోనే దంపతులు మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.



మద్దిలేటి



మద్దమ్మ

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: చోరీ కేసులో అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లెకు చెందిన రెడ్డిమోహన్ ఇంట్లో ఈ ఏడాది సెప్టెంబరు 26న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 8 గ్రాముల బంగారు, రూ.17 వేల నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణ ప్రారంభించి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తట్టివారిపల్లె వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను అనంతపురం రూరల్ మన్నాల గ్రామానికి చెందిన జె.పుల్లనాయుడుగా గుర్తించారు. అతను ప్రస్తుతం తిరుపతిలోని తీర్థకట్ట వీధిలో ఉంటున్నాడని తెలిపారు. ఇతను మదనపల్లెలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు చేశాడని, ఇతని వద్ద నుంచి రూ.1.50 లక్షలు విలువైన 30 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కర్నూలు, ఆత్మకూరు, ప్రొద్దుటూరు, మార్కాపురం, డోన్, బళ్లారి, తెలంగాణ రాష్ట్రంలోని పలుచోట్ల నేరాలకు పాల్పడ్డాడని, 17 కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు.

జననీ.. విజయరూపిణి



మహానంది: సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరీదేవి



బండిఆత్మకూరు: పార్నపల్లె ఆలయంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



సంజీవనగర్‌లోని కోదండ రామాలయంలో చండీ హోమం




గడివేములలో చిన్నారులకు పసుపు-కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. చల్లని తల్లి... కరుణచూపవేనని ప్రార్థించారు. నీ చల్లని చూపులే మాకు రక్ష అంటూ కొలిచారు.
- న్యూస్‌టుడే బృందం.



మహానంది: గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు, అధికారులు



నంద్యాల బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో రాజరాజేశ్వరిదేవి



మహానంది: బుక్కాపురం శివాలయం వద్ద విద్యుత్తు వెలుగులు

ఉద్యోగులను నిరాశపర్చొద్దు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను 12వ పీఆర్సీ అమలు విషయంలో నిరాశపర్చొద్దని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్ల సుధాకర్, గిరికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు, అభిమతానికి అనుగుణంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం 12వ పీఆర్సీ అమలు విషయంలో జాప్యం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం నియమించిన కమిషన్ రాజీనామా చేసిన నేపథ్యంలో ప్రభుత్వ వైఖరి వెల్లడించలేదన్నారు. మధ్యంతర భృతిని ప్రకటించలేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఎదురు చూస్తున్న తరుణంలో ప్రభుత్వం నిరాశను పెంచకుండా సత్వరమే ఇంటీరియర్ రిలీఫ్‌ను ప్రకటించాలని కోరారు. సీపీఎస్ నెలవారీ కాంట్రిబ్యూషన్ పాన్ నంబర్లకు ఏడాది నుంచి జమ కావడం లేదన్నారు. డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధరణి కుపేంద్ర, అదనపు కార్యదర్శి మత్రునాయక్, సభ్యులు వెంకటరాముడు, నాగరాజు, రాము, కేశాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరికుమార్

మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: వైద్యశాలలో వసతుల కల్పన, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యశాలలోని అన్ని విభాగాలు, పరిసరాలను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఆయా శాఖాధికారులు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండగ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీశైలం మండల సమన్వయకర్త యుగేంధర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

మహానందిలో ఏపీ సీఐడీ డైరెక్టర్ పూజలు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి ఏపీ సీఐడీ డైరెక్టర్ నగేష్ కుటుంబ సభ్యులతో శుక్రవారం దైవ దర్శనానికి వచ్చారు. మహానందీశ్వరస్వామి వారితో పాటు కామేశ్వరీదేవి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు సీఐడీ ఎస్సై భరత్‌కుమార్, హెచ్‌సీ లక్ష్మీనారాయణ ఉన్నారు.



కుటుంబ సభ్యులతో ఏపీ సీఐడీ డైరెక్టర్ నగేష్

విద్యుత్తు ఉపకేంద్రాల్లో..

మహానంది, న్యూస్‌టుడే: చెడుపై మంచి విజయం సాధించాలని మండల విద్యుత్తు శాఖ ఏఈఈ ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహార్నవమి సందర్భంగా దుర్గాదేవిని ఆరాధిస్తూ మహానందితో పాటు ఎం.తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల్లోని విద్యుత్తు ఉపకేంద్రాల్లో రుత్వికుల వేదమంత్రాల మధ్య భక్తిశ్రద్ధలతో ఆయుధపూజలను చేపట్టారు.



ఆయుధ పూజలు చేస్తున్న శంకర్ తదితరులు

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే గిత్తా

పగిడ్యాల, నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య కోరారు. అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలుచాని మహేశ్వరరెడ్డి, సర్వోత్తమరెడ్డి పాల్గొన్నారు.



లోకేశ్‌తో ఎమ్మెల్యే జయసూర్య, పలుచాని మహేశ్వరరెడ్డి

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని వినతి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నంద్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ఆల్‌మేవా నాయకులు కలెక్టర్ జి.రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. నంద్యాలలో వివిధ కేంద్ర సంస్థలు ఉన్నాయని, ఇందులో పనిచేసే ఉద్యోగుల పిల్లలు నాణ్యమైన విద్యకు దూరం అవుతున్నారని, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఆ లోటును పూడ్చాలని వారు పేర్కొన్నారు. ఆల్‌మేవా జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ఎండీ.అబులైస్, జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ పాషా, ఉపాధ్యక్షులు మహ్మద్ గౌస్, నబిరసూల్ తదితరులు శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్రీడాకారులకు సాయం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి గోవాలో జరిగే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు నంద్యాల మహిళా వైద్యులు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం స్థానిక ఐఎంఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందజేశారు. అనంతరం ఐఎంఏ మహిళా విభాగం సభ్యురాలు డా.వసుధరాణి మాట్లాడారు. కార్యక్రమంలో డా.లక్ష్మీసౌజన్య, డా.నాగమణి, అరుణకుమారి, డా.నర్మద పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న ఐఎంఏ మహిళా విభాగం సభ్యులు

ఆటల్లో సత్తా

■ రాష్ట్ర, సౌత్‌జోన్ ఇండియా లీగ్‌కు విద్యార్థుల ఎంపిక

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఒకవైపు చదువుతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు రాణిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన హారిక, అబ్దుల్ హక్ ఆటల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరుస్తూ మండల, జిల్లాస్థాయిని దాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శిక్షకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో తాము ఆటల్లో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు సాధన చేస్తున్నామని వారు తెలిపారు.

పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన స్వాములు, వెంకట లక్ష్మిల కుమార్తె హారిక ఖోఖోలో రాణిస్తోంది. తండ్రి లారీ డ్రైవరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మహబూబ్ సూచనలతో ఖోఖోలో జిల్లాస్థాయి నుంచి సౌత్‌జోన్ ఖేలో ఇండియా లీగ్ టోర్నమెంటుకు చేరుకొంది. గత సెప్టెంబరు 21న ఆత్మకూరు మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటడంతో నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైంది. సెప్టెంబరు 27న ఆత్మకూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 22న కర్నూలులో జరిగే జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొననుంది. ఖోఖోలో ప్రతిభ కనబరుస్తుండటంతో ఖేలో ఇండియా సౌత్‌జోన్ టోర్నమెంటు లీగ్ మ్యాచ్‌కు హారికను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాల నుంచి హారిక మాత్రమే ఎంపికైంది. సౌత్‌జోన్ లీగ్ మ్యాచ్‌కు వెళ్లేందుకు ప్రస్తుతం నెల్లూరులో 14వ తేదీ వరకు శిక్షణ ఇస్తున్నారు. కోయంబత్తూరులో ఈ నెల 16, 17 తేదీల్లో జరగబోయే ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొననుంది.



క్రికెట్‌లో అబ్దుల్ హక్ రాణింపు

ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఖాజాషర్ఫుద్దీన్, దౌలత్‌బీల కుమారుడు అబ్దుల్ హక్ క్రికెట్‌లో రాణిస్తూ అండర్ 19 పోటీల్లో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. అబ్దుల్ హక్ కర్నూలులోని టౌన్‌మాడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. 2023లో కర్నూలు మండల స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో విజేతగా నిలిచి గత ఏడాది రాష్ట్రస్థాయి క్రికెట్‌లో రన్నర్‌గా నిలిచారు. నరసారావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో కోచ్‌లు ప్రేమ్, రహంతుల్లా సూచనలతో సాధన చేస్తున్నాననీ, సెలవు రోజుల్లో అయిదు గంటలపాటు సాధన చేస్తున్నట్లు అబ్దుల్ హక్ తెలిపారు. హక్ క్రికెట్‌లో బౌలింగు విభాగంలో రాణిస్తున్నారు. ఒకసారి రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు ఓవర్లలో రెండు వికెట్లు తీసి 12 పరుగులిచ్చినట్లు తెలిపారు. షమీ ఆటతీరును స్ఫూర్తిగా భవిష్యత్తులో భారత జట్టుకు ఆడాలనే లక్ష్యం ఉన్నట్లు వెల్లడించాడు అబ్దుల్ హక్.



అవీ.. ఇవీ.. అన్నీ..

నందికొట్కూరు, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా శమీ వృక్షం వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పురపాలక ఛైర్మన్ దాసి సుధాకరరెడ్డి తెలిపారు. పండగ సందర్భంగా సాయంత్రం భక్తులు శమీ వృక్షం వద్దకు వెళ్లి అక్కడ పూజలు నిర్వహిస్తారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల సుద్దులపేటలో ఉన్న జంబులా పరమేశ్వరి దేవాలయంలో బేడబుడగజంగాలు నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని తెదేపా రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ.ఫయాజ్ ప్రారంభించారు. దేవి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బేడబుడగ జంగాల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

నంద్యాల గ్రామీణం,న్యూస్‌టుడే: పట్టణంలోని గ్రామీణ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం దశరా పండుగ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గ్రామీణ సీఐ అస్రర్‌భాష ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది దుర్గామాతకు పూజలు చేశారు. అనంతరం పోలీసు వాహనాలను, పోలీసులు ఉపయోగించే ఆయుధాలకు పురోహితుడు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్



స్వామి, అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

నయనానందకరం.. నవరాత్రి ఉత్సవం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : నవరాత్రి ఉత్సవాలు అహోబిలంలో నయనానందకరంగా సాగుతున్నాయి. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవారు ప్రతి రోజు విశేష ఆరాధనలు అందుకుంటున్నారు. శుక్రవారం అద్దాల మండపంలో స్వామి, అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవారు పల్లకిపై కొలువుదీరి తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

మద్యం దుకాణాలకు 385 దరఖాస్తులు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : డోన్ నియోజకవర్గంలో 16 మద్యం దుకాణాలకు మొత్తం శుక్రవారానికి 385 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, ఎస్సై సోమశేఖర్ తెలిపారు. డోన్ అర్బన్‌కు 4 దుకాణాలకు 153 దరఖాస్తులు, గ్రామీణ 2 దుకాణాలకు 47 దరఖాస్తులు, ప్యాపిలి 3 దుకాణాలకు గాను 45 దరఖాస్తులు, బేతంచెర్ల అర్బన్‌కు 4దుకాణాలకు 89 దరఖాస్తులు, గ్రామీణ 3దుకాణాలకు 51 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే

సమస్య : మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో వీధిదీపాలు పగటి పూట కూడా వెలుగుతున్నాయి. – కంబగిరి గ్రామస్థుడు

సమాధానం : పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – ఉదయ్, పంచాయతీ కార్యదర్శి

సమస్య : స్థానిక ఆర్టీసీ బస్టాండులోని రహదారి వర్షానికి దెబ్బతిని కంకర తేలడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – బాబు కాలనీవాసి

సమాధానం : నిధులను సమకూర్చుకొని రహదారిని బాగు చేయిస్తాం. – వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి

సమస్య : స్థానిక పోస్టాఫీసు సమీపంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అవుతుంది. – శ్రీనివాసులు కాలనీవాసి

సమాధానం : లీకేజీలను అరికడతాము. – వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి

అవుకు, న్యూస్‌టుడే :

సమస్య : అవుకులోని ఎస్సార్బీసీ కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉంది. - బాలు నాయక్ అవుకు

సమాధానం : దోమల నివారణకు ఫాగింగ్ చేపడతాం.– పంచాయతీ కార్యదర్శి

పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ

ఆళ్లగడ్డ గ్రామీణం న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో దసరా పండగ సందర్భంగా శుక్రవారం ఆయుధపూజ నిర్వహించారు. పట్టణ సీఐ చిరంజీవి, ఎస్సై నగీనతోపాటు పోలీసు సిబ్బంది ఆయుధ పూజలో పాల్గొన్నారు.



ఆయుధపూజలో సీఐ చిరంజీవి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణం సమీపంలోని కంబాలపాడు ప్రధాన రహదారిలో పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న జీడీపీ పంపుహౌస్ వద్ద పురపాలక కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఏఈ సురేష్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది ఆయుధ పూజను నిర్వహించారు.

డోన్, న్యూస్‌టుడే : పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్తు సరఫరా కేంద్రం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూనియర్ ఇంజనీర్ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : మండల పరిధిలోని నందివర్గం గ్రామంలోని పోలీస్‌స్టేషన్‌లో దసరా పండుగ సందర్భంగా శుక్రవారం ఎస్సై వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైనా సీఐ మంజునాథ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు.

ప్యాపిలి న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని జలదుర్గం పోలీసు స్టేషన్‌లో ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుధపూజ నిర్వహించారు.

కొలిమిగుండ్ల న్యూస్‌టుడే : మండలంలోని నెలటూరు శ్రీ మల్లేశ్వరస్వామికి ఆలయ కమిటీ ఛైర్మన్ బాల వెంకటరెడ్డి కుటుంబం రూ.15వేల విలువ చేసే బంగారు కమ్మలు విరాళంగా ఇచ్చారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోవెలకుంట్ల గ్రామీణం న్యూస్‌టుడే : పట్టణంలోని విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఏఈ రామ్మోహన్ ఆధ్వర్యంలో దుర్గాష్టమి పూజలు నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని పూజలు చేశారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని వల్లంపాడు గ్రామం నుంచి లింగాల దారిలో మలుపు వద్ద వంతెనపై తారు కొట్టుకుని పోయి గోతులు పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

అవుకు, న్యూస్‌టుడే : సంజామల మండలం ఆకుమళ్ళ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అవుకు వాసి వి.వెంకటక్రిష్ణయ్య (55) శుక్రవారం గుండెపోటుతో మరణించాడు.

చాగలమర్రి, న్యూస్‌టుడే : పట్టణంలోని 9వ వార్డులో ఓ బాలుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయ్యిందని ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఇంటింటికి వెళ్లి జ్వరం సర్వే నిర్వహించారు.

బేతంచెర్ల న్యూస్‌టుడే : యువత ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర నాయక్, ఉప సర్పంచి వెంకటేష్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం బుగ్గానిపల్లె తండా గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

సంజామల, న్యూస్‌టుడే : తెదేపా 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత కర్నూలులో నారా చంద్రబాబునాయుడు తెదేపా నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైకాపా ప్రభుత్వం నీరు చెట్టు, సీసీ రోడ్ల నిర్మాణం బిల్లులను మంజూరు చేయని వారిని ఆదుకుంటానని ఇచ్చిన హామీని,చంద్రబాబు నిలబెట్టుకోవాలని తెదేపా నాయకులు బెలుం సురేష్‌రెడ్డి కోరారు.

రైళ్లు నిలపండి.. సమస్య తీర్చండి

బేతంచెర్ల, న్యూస్‌టుడే : పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్ల జాతీయ స్థాయిలో నాపరాయి, రంగురాళ్ల పరిశ్రమగా గుర్తింపు పొందింది. ఇక్కడ వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉపాధి నిమిత్తం వస్తుంటారు. ఇక్కడి ప్రజలు ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు.



బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో నిలిచిన యశ్వంత్‌పూర్–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు

ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బేతంచెర్ల స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెంగళూరు, విజయవాడ, హౌరా, పుట్టపర్తి, హుబ్లీ, మచిలీపట్నం, యశ్వంత్‌పూర్, భువనేశ్వర్, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు వ్యాపారాల నిమిత్తం, వ్యాపారస్తులు విద్యార్థులు, కార్మికులు వెళ్తుంటారు.

ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు

కొవిడ్ కంటే ముందు ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ బేతంచెర్ల స్టేషన్‌లో నిలిపేవారు. కొవిడ్ సమయంలో వాటిని రద్దు చేశారు. కొవిడ్ అనంతరం స్థానిక స్టేషన్‌లో రైళ్లు నిలపక పోవడంతో జార్ఖండ్, బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారస్థులు నంద్యాల లేదా డోన్ రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోంది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం లోనైనా బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలిచే విధంగా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు

బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన రెండో ప్లాట్‌ఫారంపై ప్రయాణికులు కూర్చోడానికి బల్లలు, నీడ షెడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా రైల్వే స్టేషన్‌లో సమయపాలన తెలుసుకునేందుకు పెద్ద గడియారాన్ని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్టేషన్ వెనుక వైపు దట్టంగా ముళ్ల పొదలు పెరిగి పోవడంతో దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్థానిక ఎంపీ చొరవ తీసుకోవాలి

మద్దిలేటి, బేతంచెర్ల

బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి ప్రత్యేక చొరవ తీసుకోవాలి. కొవిడ్ తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లు బేతంచెర్ల స్టేషన్‌లో నిలుపక పోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు రైల్వే అధికారులకు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రైళ్ల కోసం ఇక్కడి నుంచి డోన్, నంద్యాల రైల్వే స్టేషన్‌కి వెళ్లి రైళ్లు ఎక్కాల్సి వస్తుంది. ఎంపీ దృష్టి సారించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలి.

డోన్ ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

రామకృష్ణ, బేతంచెర్ల

కొవిడ్ తర్వాత రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో నిలిచే విధంగా కృషి చేస్తానని ఎన్నికల ప్రచారంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని త్వరతగతిన నెరవేర్చేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలి. గత ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, నాటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనకు, నంద్యాల ఎంపీ పోచాకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోలేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాము.

40 ద్విచక్రవాహనాలు, 3 కార్లు సీజ్

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : డోన్ పట్టణంలో గంజాయి, మట్కా, సారా వంటి అసాంఘీక కార్యాకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని చిగురుమానుపేటలో, వైయస్ నగర్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, ఎస్సైలు, సిబ్బంది కలిసి కార్డన్‌సర్చ్ నిర్వహించారు. పలు ఇళ్ళలో సోదాలు నిర్వహించారు. చిగురమానుపేటలో పత్రాలు సరిగా లేని 40 ద్విచక్రవాహనాలు, 3 కార్లను సీజ్ చేసి, పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గంజాయి, మట్కా నిర్వహిస్తుంటే మాకు సమాచారం అందించాలని అందరం కలిసి మంచి సమాజం కోసం పాటుపడదామన్నారు.

మాజీ ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే

రుద్రవరం న్యూస్‌టుడే : మాజీ ఎంపీపీ పోలా సత్యవేణమ్మ కుటుంబాన్ని



సత్యవేణమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారన్న విషయాన్ని ఎమ్మెల్యే తెలుసుకుని గురువారం మండల కేంద్రంలోని ఆమె ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులతో వివరాల అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పోలా గురుమూర్తి, లింగం రంగనాయకులు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కేఈ కృష్ణమూర్తిని కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, న్యూస్‌టుడే : రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డోన్ తెదేపా మాజీ ఇన్‌ఛార్జి కేఈ ప్రతాప్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. మర్రి



మాజీ ఉపముఖ్యమంత్రిని కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి

శ్రీరాములు, ఆలంకొండ నబీసాహేబ్, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి పూజలు

చాగలమర్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని చెన్నకేశవస్వామి, అమ్మవారిశాలల్లో శుక్రవారం ఆళ్లగడ్డ తెదేపా యువనాయకులు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు చేరుకున్న విఖ్యాత్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. తెదేపా మైనార్టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్‌బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నంద్యాల బీసీ సెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, ఆలయ అధ్యక్షులు బొడ్డు వేణుగోపాల్‌రెడ్డి, వంకధార లక్ష్మణబాబు, కొలిమి ఉసేన్‌వలి, ప్రతాప్‌రెడ్డి, పాల్గొన్నారు.

డ్యాన్స్ నేర్చుకుంటే అవకాశాలు

డోన్, న్యూస్‌టుడే : డ్యాన్స్ నేర్చుకోవడం వల్ల యువకులకు శారీరక ఆరోగ్యం లభించడంతో పాటు డ్యాన్స్ పోటీలు, సినిమాలలో మంచి అవకాశాలను దక్కించుకోవచ్చని తెదేపా యువనాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని ఓ కాంప్లెక్స్‌లో డ్యాన్స్ అకాడమిని ఆయన ప్రారంభించారు. అనంతరం పాతబస్టాండ్‌లోని దుర్గమ్మ విగ్రహం వద్ద కోట్ల రాఘవేంద్రరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేషిరెడ్డి, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా నమోస్తుతే




ఆళ్లగడ్డ..పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ఉయ్యాలవాడ : బోనాలు సమర్పిస్తున్న మహిళలు



బనగానపల్లిలో శ్రీ విజయ లక్ష్మి అలంకారంలో..



శిరివెళ్ల : రాజరాజేశ్వరిదేవి



బనగానపల్లి గ్రామీణం : ప్రాకార ఉత్సవంలో భక్తులు



ప్యాపిలి: మహిషాసురమర్దిని అలంకారంలో శ్రీ వాసవిమాత

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

బేతంచెర్ల న్యూస్‌టుడే : బేతంచెర్ల పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త తిరుమలేష్ చౌదరి, ఉమామహేశ్వరి దంపతుల కుమార్తె మైత్రీ చౌదరి హైదరాబాద్‌లో వీఎన్ఆర్ విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతుంది. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తుంది మైత్రీ చౌదరి. ఇండో-థాయ్‌లాండ్ త్రోబాల్ టెస్ట్ సీరీస్ 2024 అంతర్జాతీయ త్రోబాల్ పోటీలు కసెమ్ బండిట్ యూనివర్సిటీ బ్యాంకాక్ థాయ్‌లాండ్ దేశంలో ఈ నెల 10న జరిగాయి. ఈ పోటీల్లో శ్రీలంక, ఇండియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు చెందిన జట్లు పోటీ పడ్డాయి. ఈ పోటీల్లో మైత్రీ చౌదరి తెలంగాణ జట్టు తరపున ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచి షీల్డ్, మెడల్స్, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈమెను పలువురు అభినందించారు.



షీల్డ్ అందుకుంటున్న మైత్రీ చౌదరి

తపాలాశాఖలో ఎన్నో పథకాలు

డోన్ న్యూస్‌టుడే : తపాలాశాఖ ఆధ్వర్యంలో ఎన్నో పథకాలు అందుబాటులో ఉన్నాయని డోన్ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉడుములపాడు గ్రామంలో తపాలా వారోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలాశాఖలో సేవింగ్స్ ఖాతా, బాలికల కోసం సుకన్య సమృద్ధిఖాతా, గ్రామీణ తపాలా భీమా, ఇండియా పోస్ట్ పేమేంటు బ్యాంకు, సేవలు, ప్రమాదబీమా పథకం అందుబాటులో ఉన్నాయన్నారు. తపాలా శాఖలోని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న పోస్టల్ అధికారి చంద్రమౌళీశ్వరరెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సహజం

చాగలమర్రి, న్యూస్‌టుడే : క్రీడల్లో గెలుపోటములు సహజమని, అందరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని తెదేపా మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్‌బాషా తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాయలసీమ స్థాయి సిద్దిక్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. రాయలసీమలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులు కోటయ్య, విద్యాకమిటీ ఛైర్మన్ జల్సాగోస్, దాదాపీర్, తెదేపా నాయకులు మౌలాలి, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటాకు నివాళి

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే : పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటాకు ఆళ్లగడ్డ పట్టణంలో గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు శుక్రవారం నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలు వేసి సంతాపం తెలిపారు. త్రినేత్ర మోహన్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీనివాస రెడ్డి, రామకోటి నాగరాజు, నాగేష్ ,బాషా పాల్గొన్నారు.



రతన్‌టాటా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గణేష్ ఉత్సవ సభ్యులు

సాగునీటికి పొగాకు రైతుల కష్టాలు

ఉయ్యాలవాడ న్యూస్‌టుడే : ఖరీఫ్ చివరిలో వర్షాధారంపైనే ఆధారపడి రైతులు పొగాకు పంటను సాగు చేశారు. తుడుమలదిన్నెలో 1500 ఎకరాల విస్తీర్ణంలో చుక్కపల్లె, నల్లబర్లి, నాటు పొగాకును సాగు చేశారు. ఎస్సార్బీసీ కాల్వ నుంచి వస్తున్న నీటిని ఆయిల్ ఇంజన్ల సాయంతో పైపులు అమర్చుకొని పొగాకు పంటకు నీటితడులు అందిస్తున్నారు. రోజుకి ఒక పైపు బాడుగకి రూ.10 చెల్లిస్తున్నామని దీంతో పొలానికి తడి ఇవ్వడానికి రోజుకు రూ.5500ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. చివరి ఆయకట్టుకు నీరు రాకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రారెత్తిస్తున్న టమాటా

డోన్, న్యూస్‌టుడే: టమాటా ధరలతో రారెత్తిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనూ చుక్కలు చూపించింది. కిలో 70 నుంచి 80 వరకు పలకగా, కొన్ని చోట్ల కిలో రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పలు మార్కెట్లలో ఆకాశాన్నంటిన ధరలను తగ్గించేందుకు మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి వాటిని రైతుబజార్లలో తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ చర్యలు కేవలం రెండురోజులే చేపట్టారు. ధరలు తగ్గాయని మార్కెటింగ్ శాఖ అధికారులు కొనుగోలు చేసి అందించకపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7200 హెక్టార్ల వరకు టమాటా సాగైంది. ఈ ఏడాది అకాల వర్షాలు, ప్యాపిలి ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల్లో దిగుబడులు ఆశించిన స్థాయిలో రాలేదు. గత నెలలో అకాల వర్షాలు కురవటంతో ఎక్కువగా తెగుళ్లు సోకి కాయల నాణ్యత తగ్గిపోయింది. దీంతో కాయలపై మచ్చలు ఉండటం, ఆశించిన స్థాయిలో దిగుబడులు లేకపోవటంతో మార్కెట్లో కొరత ఏర్పడింది.



మార్కెట్టుకు వచ్చిన టమాటా బాక్సులు

రెండు రోజులే మార్కెటింగ్‌శాఖ కొనుగోలు..

టమాటా ధరలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టారు. ప్యాపిలి, పత్తికొండ మార్కెట్లలో కొనుగోళ్లు జరిగాయి. ప్యాపిలిలో 3 టన్నులు, పత్తికొండలో 3 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అక్కడ నుంచి సరకును కొనుగోలు చేసి కర్నూలు, కొంత నంద్యాల మార్కెట్లకు తరలించారు. రైతుబజార్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఒక రోజు రూ.46, 38.60 ప్రకారం కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మార్కెట్లో ధరలు తగ్గినపుడే కొనుగోలు చేయడం లేదు

–నారాయణమూర్తి ఏడీ మార్కెటింగ్, కర్నూలు.

మార్కెట్లలో ధరలు తక్కువగా ఉన్నపుడు కొనుగోలు చేయటం లేదు. ధరలు ఎక్కువగా ఉన్నపుడే కొనుగోలు చేసి రైతుబజార్లలో అందుబాటులో ఉంచుతున్నాం. రెండురోజులపాటు ధరలు ఎక్కువ ఉండటంతో కొనుగోలు చేశాం. కిలో రూ.35 నుంచి 70 వరకు ఉంటే కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుంది. రూ.35 కంటే తక్కువగా ఉంటే కొనుగోలు చేసేందుకు తమకు అనుమతిలేదు.

ఏళ్లు గడిచినా.. సమస్యలు తీరలే

శిరివెళ్ల న్యూస్‌టుడే : గ్రామాలలో ఏళ్లకొద్ది నెలకొన్న సమస్యలతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, 10 మజారా గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలలో దాదాపుగా 17,700 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మండలంలో యర్రగుంట్ల, శిరివెళ్ల మేజర్ పంచాయతీలుగా ఉన్నాయి. ఏళ్లుగా ఆయా గ్రామ పంచాయతీలలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యర్రగుంట్ల గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి 30ఏళ్లకు పైగా అవుతుండటంతో శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. నూతన ట్యాంకును నిర్మించాలని చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. అదేవిధంగా గ్రామంలో సినిమా హాల్ సమీపంలో, గురప్పస్వామి ఆలయ సమీపంలో హిందూ శ్మశాన వాటికలు అపరిశుభ్రత, ముళ్లపొదలతో ఉన్నాయి.



యర్రగుంట్లలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకు

గ్రామాలలో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు

☛ గోవిందపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో నూతనంగా ఏర్పడిన కాలనీలో విద్యుత్తు స్తంభాలు, తాగునీటి వసతి, రహదారి, డ్రైనేజీ కాలువలు లేక సుమారు 80 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

☛ చెన్నూరు నుంచి ఇసుకపల్లె వెళ్లే బీటీ రహదారి పూర్తిగా దెబ్బతింది. ఆయా గ్రామాల్లో బీసీ, ఎస్సీ కాలనీలలో సీసీ రహదారులు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

☛ జీనపల్లె గ్రామంలోని ప్రధాన రహదారి సీసీ నిర్మాణానికి నోచుకోక పోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

☛ కామినేనిపల్లె, కోటపాడు, గుండంపాడు, పచ్చర్ల, మహదేవపురం గ్రామాల్లో శ్మశానవాటికలు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో రహదారుల పక్కనే అంత్యక్రియలు కర్మకాండలు నిర్వహిస్తున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు గుర్తించి ఆయా గ్రామాల్లో ప్రభుత్వం స్థలాలను గుర్తించి శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



దెబ్బతిన్న వీరారెడ్డిపల్లె యాళ్లూరు బీటీ రహదారి

శిరివెళ్ల గ్రామం నుంచి వీరారెడ్డిపల్లె, కోటపాడు గ్రామాల మీదుగా యాళ్లూరుకు వెళ్లే బీటీ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, వృద్ధులను ఈ రహదారిలో తీసుకెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

శ్రీనివాసశర్మ.. ఈవోపీఆర్డీ.. శిరివెళ్ల

మండల పరిధిలోని గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరయ్యే నిధులతో ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. విడతల వారీగా సమస్యలను పరిష్కరిస్తాం.

బాలుడి మృత దేహం గుర్తింపు

అవుకు, న్యూస్‌టుడే : కాలువ నీటిలో పడిపోయిన విద్యార్థి ఆచూకీని డ్రోన్‌కెమెరాలు శుక్రవారం గుర్తించాయి, అవుకు సమీపంలోని గాలేరు-నగరి సొరంగాల వద్ద చువ్వలకు శవం అతుక్కుపోయినట్లు గుర్తించారు. బనగానపల్లి మండలం యాగంటి పల్లెకు చెందిన మధుకౌషి (10) గత సోమవారం బనగానపల్లి సమీపంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గాలేరు-నగరి కాల్వలో పడిపోయిన విషయం తెలిసిందే.

గొర్రెలు దొంగిలించే ముఠా అరెస్టు

దర్శి, న్యూస్‌టుడే: గొర్రెలు దొంగిలించే ముఠా సభ్యులను ప్రకాశం జిల్లా ముండ్లమూరు పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను శుక్రవారం దర్శి సీఐ రామారావు విలేకరులకు వెల్లడించారు. దర్శి, బేస్తవారపేట, నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో గొర్రెల దొంగతనాలు ఎక్కువైన నేపథ్యంలో పోలీసలు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు మొదలుపెట్టారు. ముండ్లమూరు మండలం పులిపాడు శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు సిరివెళ్ల మండలం గోవిందపల్లికి చెందిన పెనుగొండ కుళాయప్ప, అవుకు మండలం మెట్టుపల్లికి చెందిన ఎరుకలి చిన్న ఆంజనేయులు, బనగానపల్లికి చెందిన దేవరకొండ రమేష్‌గా గుర్తించారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.2.05 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

తండ్రి, తమ్ముడిపై కత్తితో దాడి చేసిన అన్న

రుద్రవరం న్యూస్‌టుడే : ఇతరులతో గొడవలు పడొద్దన్నందుకు అన్న తన తండ్రి, తమ్ముడిపై కత్తితో దాడి చేసిన ఘటన రుద్రవరం మండలంలోని బి.నాగిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో తండ్రికి గాయాలు కాగ, తమ్ముడు మృతి చెందాడు. శిరివెళ్ల సీఐ వంశీధర్ వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం బి.నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓబులేషు ఇంటి ముందు నుంచి సురేంద్ర ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్లాడు. వేగంగా వెళ్లొద్దంటూ ఓబులేషు సురేంద్రపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయంపై ఓబులేషు తండ్రి, తమ్ముడు ఇతరులతో ఎందుకు నిత్యం గొడవలు పడుతున్నావని ఓబులేషని వారించారు. తాగిన మత్తులో ఉన్న ఓబులేషు తండ్రిని కొడుతుండగా అక్కడే ఉన్న తమ్ముడు కర్రెన్న అలియాస్ ఇసాక్ అడ్డం రావడంతో ఆయన్ని కత్తితో పొడిచాడు. చికిత్స నిమిత్తం కర్రెన్నను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రాత్రి 12 గంటల సమయంలో కర్రెన్న మృతి చెందాడు. కర్రెన్న భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓబులేషుపై కేసు నమోదు చేసి, శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.